పేదలకు ఆధునిక వైద్యం.. సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని
- ఏలూరులో రూ.3.61 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



యూపీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్, డీఎంహెచ్‌ఓ ఆశ తదితరులు



సత్రంపాడులో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ట్యాప్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఏలూరు టౌన్: ప్రతి పేదవానికీ ఉచితంగా ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తేవటమే లక్ష్యంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. శనివారం ఏలూరు నగరంలో సుమారు రూ.3,61,77,000 వ్యయంతో నిర్మించిన పలు కార్యాలయాలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, నగర మేయర్ షేక్ నూర్జహాన్, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. ప్రాంగణంలో మొక్కలు నాటి, నీరు పోశారు. 39వ డివిజన్ కొత్తపేట సంతోష్‌నగర్, 34వ డివిజన్ పవర్‌పేట డీఎంహెచ్‌ఓ కార్యాలయం వెనుక సుమారు రూ.1.71 కోట్లు ఎన్‌హెచ్‌ఎం, ఏపీహెచ్‌ఎస్సీ నిధులతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. వన్‌టౌన్ 18వ డివిజన్ లక్ష్మమ్మ కోనేరులో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 కోట్లతో గ్యాస్ ఆధారిత విద్యుత్ దహన వాటికను ప్రారంభించారు. సత్రంపాడు యాదవనగర్‌లో జలజీవన్ మిషన్ నిధులు రూ.39.82 లక్షలతో నిర్మించిన రక్షిత మంచి నీటి పథకాన్ని నాని ప్రారంభించారు.

ఉచితంగా దహన సంస్కారాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు అర్బన్ పరిధిలో సుమారు రూ.5 కోట్లతో 10 యూపీహెచ్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. 5 యూపీహెచ్‌సీలను ఆధునికీకరణ చేయగా, మరో 5 యూపీహెచ్‌సీల్లో ఇప్పటికే 3 యూపీహెచ్‌సీల నూతన భవనాలు ప్రారంభించామని వివరించారు. సుమారు రూ.5 కోట్లతో నాలుగు శ్మశాన వాటికల్లో సౌకర్యాలు మెరుగు పరిచామన్నారు. 18వ డివిజన్‌లో రూ.1.50 కోట్లతో గ్యాస్ ఆధారిత విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశామని చెప్పారు. టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారమిస్తే మృతదేహాన్ని ఉచితంగా శ్మశాన వాటికకు తరలించి దహన సంస్కారం చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో మారుమూల ప్రాంత ప్రజలకూ రక్షిత తాగునీరు సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. సత్రంపాడు యాదవనగర్‌లో జలజీవన్ మిషన్ నిధులతో రక్షిత మంచినీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు బొద్దాని శ్రీనివాస్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు కిలాడి జ్యోతి, యర్రంశెట్టి సుమన్, భీమవరపు హేమసుందరి, ఆర్జి సత్యవతి, జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, తుమరాడ స్రవంతి, కత్తిరి రామ్మోహనరావు, ఇనపనూరి కేదారేశ్వరి, జగదీష్, కిలాడి దుర్గారావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆశ, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ మాలతి, పార్టీ నాయకులు మజ్జి కాంతారావు, నున్న కిషోర్, భీమవరపు సురేష్, ఆర్జి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మానసిక వికలాంగులకు అన్నదానం



వికలాంగులకు అన్నదానం చేస్తున్న జమాత్ నాయకులు

ఏలూరు (టూటౌన్): అహేలేసున్నత్‌వల్ జమాత్ ఆధ్వర్యంలో స్థానిక తంగెళ్లమూడి మానసిక వికలాంగులకు శనివారం అన్నదానం చేశారు. అహేలేసున్నత్‌వల్ జమాత్ సేవే పరమావధిగా ప్రజలకు అవసరమయ్యే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఇటీవల ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదానం, యానాదుల కాలనీల్లో అల్పాహారం, పేద వృద్ధులకు దుస్తులు అందజేశామని గుర్తుచేశారు. సేవా కార్యక్రమాలకు మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇలియాస్ పాషా, అబూబాయ్, ఎండీ సురు, ఎం.ఇక్బాల్, అస్లాం ఆలీపాషా, గాలీబ్ ఆలీ, అమీనా అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: అనారోగ్యంతో ఒక వ్యక్తి విషం తీసుకుని ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దెందులూరు మండలం సానిగూడెంకు చెందిన కళ్లెం నాని (40)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాని కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా కడుపులో నొప్పి భరించలేక ఈనెల 15తేదీ రాత్రి విషం తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన నానిని బంధువులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆసుపత్రి వైద్యులు మెడికో లీగల్ కేసు నమోదు చేసి హాస్పిటల్ ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోడి వ్యర్థాలు తరలించే ఇద్దరి అరెస్ట్

ఏలూరు టౌన్: ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి చేటు తెచ్చే కోడి వ్యర్థాలను తరలిస్తోన్న ఇద్దరు వ్యక్తులను ఏలూరు త్రీటౌన్ ఎస్సై శంకర్ అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ మండలం వడ్డిగూడేనికి చెందిన భలే రాటాలు, కంభం నవీన్ అనే ఇద్దరూ టాటా మేజిక్ వాహనంలో హైదరాబాద్ నుంచి కోడి వ్యర్థాలను తమ చేపల చెరువులకు తీసుకువెళ్తున్నారు. ఏలూరు మినీబైపాస్‌లో ఎస్సై శంకర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా కోడి వ్యర్థాల వాహనాన్ని గుర్తించి, ఇద్దరిని అరెస్టు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



బ్రోచర్ విడుదల చేస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఏలూరు (టూటౌన్): 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఈ నెల 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు గుత్తా గిరిబాబు కోరారు. స్థానిక కోటదిబ్బ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డిగ్రీ ప్రవేశాల ప్రచార బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఏలూరు ప్రభుత్వ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి బీఏ (హిస్టరీ మేజర్, ఎకనామిక్స్ మైనర్), బీకామ్ (కామర్స్ మేజర్, కంప్యూటర్ అప్లికేషన్స్ మైనర్), బీఎస్సీ (జువాలజీ మేజర్, బొటనీ మైనర్), బీఎస్సీ (మ్యాథ్స్ మేజర్ – కెమిస్ట్రీ మైనర్) కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి కళాశాలలో ఈనెల 19 నుంచి హెల్ప్‌లైన్ సెంటర్ విద్యార్థులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీడీసీ కార్యదర్శి ఇరదల రఘుబాబు, సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, బత్తిన మస్తానరావు, అధ్యాపకులు సీహెచ్ ఉదయలక్ష్మి, ఎం.రాంబాబు, ఎస్.పరమేష్, ఎస్.కరుణ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు జిల్లాలో పనిచేసి రిటైర్డయిన ప్రతి కార్మికుడూ సంబంధిత డిపోలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏలూరు జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు ఆయా డిపోల్లో తమ ఆధార్‌కార్డు వివరాలు, ఆధార్ అనుసంధాన సెల్‌ఫోన్ నెంబర్ రికార్డు చేసుకోవాలని పేర్కొన్నారు. దీంతో రిటైర్డ్ అయిన ఉద్యోగికి తెల్లరేషన్‌కార్డు మంజూరవుతుందని తెలిపారు.

యోగతో ఆరోగ్యవంతమైన సమాజం



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ఆయుష్ శాఖ

ఏలూరు (టూటౌన్): యోగతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ పీవీవీఎస్ఎన్ చౌదరి అన్నారు. తొమ్మిదవ అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ కమిషనర్, ప్రాంతీయ ఉపసంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా ఆయుష్ అధికారి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయుష్ అధికారి పీవీవీఎస్ఎన్ చౌదరి మాట్లాడుతూ యోగ ప్రాముఖ్యతను వివరించారు. యోగ విద్యాభ్యాసం వల్ల ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేసుకోగలమన్నారు. టీటీడీసీ వట్లూరు, డీఆర్‌డీఏ హాలులో ఈ నెల 21న నిర్వహించే 9వ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ వెలెనెస్ సెంటర్ సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి కేవీఎల్ సుభద్ర, ఆయుర్వేద వైద్యులు వీవీఎం నగేష్, ఎల్.శ్రీనివాస్, పీఆర్‌పీ శాంతకుమారి, ఆయుష్ సిబ్బంది, ఆయుష్ వెల్‌నెస్ సెంటర్ యోగ శిక్షకులు, కేపీడీటీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపటం నేరం



వాహనచోదకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: మద్యం సేవించి మోటారు సైకిళ్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు బి.శ్రీనివాసరావు, శ్రీధర్ హెచ్చరించారు. ఏలూరు నగరంలో శనివారం పలు ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కొందరు వాహనచోదకులను అదుపులోకి తీసుకుని ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనం నడిపితే ప్రాణాలకే ప్రమాదమని, ఎదుటివారి ప్రాణాలను హరించే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. మద్యం తాగి మోటారు సైకిల్ నడపవద్దని హితవుపలికారు. తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని, విధిగా మోటారు సైకిల్ రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. హెల్మెట్ ధరించటం ద్వారా ప్రాణాలు రక్షించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎస్సీ కాలనీ రోడ్ల అభివృద్ధికి హామీ

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ నిధులతో ప్రత్తికోళ్లలంక ఎస్సీ కాలనీ రోడ్లు అభివృద్ధి చేస్తామని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఎస్సీకాలనీ పెద్దలు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఎంపీపీని కలిశారు. కాలనీలో లోతట్టున ఉన్న సీసీ రోడ్డును పునర్నిర్మించాలని కోరారు. దీంతో శ్రీనివాసరాజు మొదట 1500 మీటర్ల దూరం ఉన్న కాలనీ రోడ్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రత్తికోళ్లలంక గ్రామానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07–10
బెండకాయలు	28	కంద	48
పచ్చిమిర్చి	76–84	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	44
బీరకాయలు	24–46	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	40
క్యారెట్	36	పాలకూర	10–12
దొండకాయలు	26	చుక్కకూర	10–12
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	16–18	బఠాణీ	--
ఆనపకాయ (1)	15–20	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	31
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

బహుజన రాజ్యాధికార సభ కరపత్రం విడుదల



బహుజన రాజ్యాధికార సభ కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు మదనపల్లిలో నిర్వహించే బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నేతల రమేష్ బాబు పిలుపు నిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం మహాసభ కరపత్రం విడుదల చేశారు. మహాసభలో పార్టీ జాతీయ కోఆర్డినేటర్ ఆకాశ్ ఆనంద్, బహుజన సమాజ్ పార్టీ రాజ్య సభ్యులు, ఏపీ ఇన్‌చార్జి రాంజీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, రాష్ట్ర నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భూపతి అప్పారావు, ఎం.లోకేష్, వన్ కుమార్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

తనిష్క్‌లో గోల్డ్ ఎక్చేంజ్ పాలసీ



ఏలూరులోని తనిష్క్ గోల్డ్ షోరూం

ఏలూరు (టూటౌన్): భారతదేశ అత్యంత విశ్వసనీయ ఆభరణాల బ్రాండ్ తనిష్క్ షోరూంలో వంద టన్నుల గోల్డ్ ఎక్చేంజ్ వేడుక నిర్వహిస్తున్నట్టు ఏరియా మేనేజర్ పూర్ణచంద్ర తెలిపారు. దేశంలో రెండు మిలియన్ల వినియోగదారులు తమ పాత బంగారాన్ని మార్చుకోవడానికి తనిష్క్‌ను ఎంచుకున్నట్టు చెప్పారు. బంగారానికి గరిష్ట విలువను అందుకోవడానికి జీరో డెడక్షన్ అందజేస్తున్నట్టు తెలిపారు. ఏడాది పొడవునా బంగారు మార్పిడి సేవలను అందిస్తామన్నారు. చేతితో తయారు చేసిన ఆభరణాలకు యాక్సెస్‌ను అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టైటాన్ కంపెనీ జ్యూయలరీ డివిజన్ సీఈఓ అజోయ్ చావ్లా మాట్లాడుతూ నేటి ధరల నేపథ్యంలో లాకర్లల్లో నిరుపయోగంగా ఉన్న బంగారం మార్చుకోవడం ఉత్తమమని సూచించారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ఏలూరు టౌన్: ఏలూరు గన్‌బజార్ రైల్వేబ్రిడ్జి కింద రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనటంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక గుర్తించి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి 108లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందించగా ప్రస్తుతం ఆ వ్యక్తి ఆరోగ్యస్థితి నిలకడగా ఉంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు కొత్తపేట 40వ డివిజన్‌కు చెందిన పత్తికాయల అరవింద్ అనే యువకుడు శనివారం ఉదయం 7.25 గంటల సమయంలో ఏలూరు వన్‌టౌన్ పాండురంగ థియేటర్ ప్రాంతంలో నివసించే తన పిన్ని పరదేశి విజయకుమారి ఇంటికెళ్లి వస్తుండగా గన్‌బజార్ రైల్వేబ్రిడ్జి కింద రైలు పట్టాలు దాటుతు ఉన్నాడు. ఇదే సమయంలో పురులియా నుంచి విల్లుపురం వెళ్లే రైలుబండి రావటాన్ని గుర్తించకపోవటంతో అరవింద్‌ను ఢీకొట్టింది. అతను రైలు పట్టాల పక్కన పడి ఉండగా ఎవరో అరవింద్‌ను గమనించి వివరాలు అడిగి బంధువులకు ఫోన్ చేశారు. అతని బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇదే సమయంలో రైల్వే కానిస్టేబుల్స్ ఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు అరవింద్‌కు ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందించగా ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది.

ఉద్యమ కారులపై కేసులు ఎత్తివేయాలి

ఏలూరు (టూటౌన్): ప్రజా ఉద్యమ కారులపై పెట్టిన రాజద్రోహం కేసులను ఎత్తివేయాలని ఎంసీపీఐ (యు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఇతరులపై పెట్టిన ఉపా చట్టం కేసులు తక్షణమే ఎత్తివేయాలిన కోరారు. నూడెమోక్రసీ మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్యను కూడా ఉపా చట్టం కింద కేసు పెట్టడం సరికాదన్నారు. ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ప్రధాని మోదీ పాలనపై నేడు సభ

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ఆదివారం సాయంత్రం ఏలూరు రామకోటి ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు మోదీ పాలన ప్రచార కార్యక్రమాల గోదావరి జోనల్ ఇన్‌చార్జి, ఏలూరు పార్లమెంటరీ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ రాజ్యసభ సభ్యులు సుజనాచౌదరి హాజరుకానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొర్లళ్ల సుధాకర్‌కృష్ణ, గాది రాంబాబు, నుదురుపాటి కృష్ణచైతన్య శర్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టే జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని ఏలూరు మండల ప్రత్యేక అధికారిణి కుముదునిసింగ్ అన్నారు. శనివారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జులై 3 నుంచి 27 వరకు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందుకోసం రెండు టీమ్స్ ఏర్పాటుచేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది గ్రామ సచివాలయాల్లో ఉదయం 9 గంటలకు ప్రజలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీయాలన్నారు. అర్హులకు పథకాలు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, ఇన్‌చార్జి ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.